గ్రూప్‌-1 మొదటి వంద ర్యాంకుల వివరాలు బహిర్గతం చేయాలి



అభివాదం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

పంజగుట్ట: గ్రూప్‌–1 ఫలితాల్లో మొదటి వంద మంది ర్యాంకుల వివరాలు, వారు ఏ కోచింగ్‌ సెంటర్‌లో శిక్షణ తీసుకున్నారో పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌ గౌడ్‌ డిమాండ్‌ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. మాతృభాష తెలుగులో గ్రూప్‌–1 రాసిన అభ్యర్థులపై తీవ్ర వివక్ష చూపించారని, తెలుగు అభ్యర్థులు ఎంతో ఆవేదన చెందుతున్నారని గ్రూప్‌–1 పేపర్‌ రీ కౌంటింగ్‌ కాదు, రీ వాల్యుయేషన్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. గ్రూప్‌–1లో 563 పోస్టులు ఉంటే కేవలం రెడ్డి కులానికే 100 ర్యాంకులు ఎలా వస్తాయని డీఎస్పీ, ఆర్‌డీవో రెడ్డి కులస్తులకు ఇచ్చే ప్రయత్నం రెడ్డి ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు. వెంటనే గ్రూప్‌ వన్‌ రీ వ్యాల్యుయేషన్‌ చేయాలని ఆయన డిమాండ్‌ చేశారు. సుధగాని హరిశంకర్‌ గౌడ్‌, దేశగాని సాంబశివ గౌడ్‌, శ్రీనివాస్‌, ప్రవీణ్‌, శ్రీహరి, భిక్షపతి పాల్గొన్నారు.

విద్యావకాశాలు–విజ్ఞానం కోసం ఒప్పందం



బంజారాహిల్స్‌: విదేశాల్లో చదువుకోవాలనుకునే విద్యార్థులకు అక్కడి యూనివర్సిటీల్లోని విద్య, ఉపాధితో పాటు పలు రకాల సమాచారం కోసం ఏఐఆర్‌సీ(అసోసియేషన్‌ ఆఫ్‌ ఇంటర్నేషనల్‌ ఎన్‌రోల్‌మెంట్‌ మేనేజ్‌మెంట్‌) సంస్థతో సిఫియా(కన్సార్టియం ఆఫ్‌ ఫారెన్‌ ఎడ్యుకేషన్‌ అడ్వైజర్స్‌) ఒప్పందం దోహదం చేస్తుందని సిఫియా అధ్యక్షుడు శేఖర్‌ భూపతి అన్నారు. బంజారాహిల్స్‌లోని తాజ్‌దక్కన్‌ హోటల్‌లో ప్రపంచవ్యాప్తంగా 450 సంస్థలతో అనుబంధం కలిగిన అమెరికాకు చెందిన ఏఐఆర్‌సీ సంస్థతో కన్సార్టియం ఆఫ్‌ ఫారెన్‌ ఎడ్యుకేషన్‌ అడ్వైజర్స్‌ సంస్థ మంగళవారం ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందం వల్ల విద్యార్థులకు అమెరికా, యూకే, జర్మనీ, ఆస్ట్రేలియా దేశాల్లోని యూనివర్సిటీల్లో విద్యార్థుల ఏం కోరుకుంటున్నారో, ఎటువంటి కోర్సులు అవసరం అవుతున్నాయో అక్కడి యూనివర్సిటీ ప్రతినిధులు, ప్రభుత్వాలతో చర్చించేందుకు అవకాశం ఉంటుందని ఏఐఆర్‌సీ ఈడీ డాక్టర్‌ క్లే హార్మన్‌ తెలిపారు. అమెరికాలో ఇప్పుడు యూనివర్సిటీల్లో విద్యార్థులకు ఉన్న రూల్స్‌ కొత్తవేమీ కాదని, గతంలో ఉన్నవేనని కానీ కొంతమంది ట్రంప్‌ వచ్చిన తర్వాత పెట్టినట్లు ప్రచారం చేస్తున్నారని, అది కరెక్టు కాదని అన్నారు. ఏఐఆర్‌సీ అధ్యక్షుడు డాక్టర్‌ రాబర్ట్‌ సమ్మర్స్‌ సిఫియా ఉపాధ్యక్షుడు సూర్య గణేష్‌ వాల్మీకి, సెక్రటరీ నవీన్‌ యాతపు, జాయింట్‌ సెక్రటరీ, గ్లోబల్‌ ట్రీ వ్యవస్థాపకులు శుభకర్‌ ఆలపాటి తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి చేసి చోరీ

బంజారాహిల్స్‌: రోడ్డు పక్కన టీ స్టాల్‌ పక్కన నిలబడ్డ ఓ యువకుడిని నంబర్‌ ప్లేట్‌ లేని బైక్‌పై వచ్చిన ఇద్దరు ఆగంతకులు బలవంతంగా తమ బైక్‌పై ఎక్కించుకుని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి తీవ్రంగా కొట్టి నగదుతో పాటు మొబైల్‌ ఫోన్‌ తస్కరించిన ఘటన జూబ్లీహిల్స్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బషీర్‌బాగ్‌లో నివసించే జరపుల జనార్దన్‌(25) సోమవారం రాత్రి జూబ్లీహిల్స్‌ రోడ్డు నంబర్‌–36లోని రత్నదీప్‌ సూపర్‌ మార్కెట్‌ వద్ద టీ తాగి నిలబడ్డాడు. అర్ధరాత్రి ప్రాంతంలో ఇద్దరు ఆగంతకులు నంబర్‌ ప్లేట్‌ లేని స్కూటీపై వచ్చి గంజాయి అమ్ముతున్నావా అంటూ బెదిరించడమే కాకుండా తనిఖీలు చేశారు. తమ బైక్‌పై ఎక్కించుకుని వరమహాలక్ష్మీ క్లాత్‌ స్టోర్‌ పక్కన నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లారు. ముఖంపై, కడుపులో తీవ్రంగా కొట్టి జేబులో ఉన్న నగదుతో పాటు మొబైల్‌ ఫోన్‌, హెడ్‌ సెట్లను లాక్కొన్నారు. వెళ్లే క్రమంలో జనార్దన్‌ను తీవ్రంగా కొట్టారు. బాధితుడు జూబ్లీహిల్స్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.12 లక్షల చీరల చోరీ

బంజారాహిల్స్‌: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన చీరల ప్రదర్శనలో రూ.12 లక్షల విలువ చేసే ఖరీదైన చీరలు చోరీకి గురైన ఘటన జూబ్లీహిల్స్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు.. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం బెంగళూరుకు చెందిన ప్రముఖ డిజైనర్‌ దండా అంజనీదేవి అనుసిక్స్‌ యార్డ్స్‌ శారీస్‌ పేరిట జూబ్లీహిల్స్‌ రోడ్డు నంబర్‌–44లోని పెద్దమ్మగుడి వెనుక ఉన్న దారా కేఫ్‌లో చీరల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రదర్శన ముగిసిన తర్వాత చీరలను ప్యాక్‌ చేసింది. తర్వాత చూసుకోగా రూ.12 లక్షల విలువ చేసే చీరలు కనిపించలేదు. కేఫ్‌లో సీసీ కెమెరాలు పరిశీలించగా ఆరుగురు మహిళలు చీరలను చోరీ చేసినట్లు సీసీ ఫుటేజీలో నమోదైంది. బాధిత డిజైనర్‌ ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్యం.. స్వచ్ఛం.. సుందరం



ఎస్‌ఎఫ్‌ఏలకు అవగాహన కల్పిస్తున్న ఖైరతాబాద్ సర్కిల్‌–17 డీసీ రజనీకాంత్‌రెడ్డి

- స్వచ్ఛ సర్వేక్షణ్‌పై దృష్టిపెట్టిన అధికారులు
- సిటిజన్స్‌ ఫీడ్‌బ్యాక్‌ తీసుకోవాలని ఆదేశాలు
- వార్డుస్థాయిలో నిర్వహణ రిజిస్టర్‌ తప్పనిసరి
- క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలి

బంజారాహిల్స్‌: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంక్‌ కోసం జీహెచ్‌ఎంసీ సర్కిళ్ల పరిధిలో ఇప్పటి నుంచే పారిశుద్ధ్య విభాగం సిబ్బంది, అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌ బృందం త్వరలోనే పర్యటించనున్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్‌ సర్కిల్‌–17, జూబ్లీహిల్స్‌ సర్కిల్‌–18 పరిధిలో పారిశుద్ధ్యంపై అధికారులు దృష్టి సారించారు. ముఖ్యంగా రోడ్ల పక్కన చెత్తా చెదారం పేరుకుపోకుండా వల్నరబుల్‌ గార్బేజ్‌ పాయింట్ల తొలగింపుపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించారు. ఎక్కడెక్కడ వల్నరబుల్‌ గార్బేజ్‌ పాయింట్లు ఉన్నాయో వాటిని పూర్తిగా లేకుండా చేసి రోడ్లపై చెత్త వేయకుండా చూడాలని సూచిస్తున్నారు. సర్కిల్‌–17 పరిధిలో 40 మంది, సర్కిల్‌–18 పరిధిలో 33 మంది ఎస్‌ఎఫ్‌ఏలు పనిచేస్తున్నారు. ఇంటింటి చెత్త సేకరణపై ఎస్‌ఎఫ్‌ఏలకు తగిన సూచనలు చేశారు. రోడ్ల పక్కన చెత్త వేసే వారు తమ ఇంటికి స్వచ్ఛ ఆటో రావడం లేదా? అని ప్రశ్నించాలని, స్వచ్ఛ ఆటో ఎందుకు వెళ్లడం లేదో తెలుసుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. మార్చి మూడో వారం నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్‌పై బృందాల పరిశీలన ఉంటుందని, ఇప్పటికే మార్గదర్శకాలు వెలువడ్డాయి. ప్రతి కాలనీలో రెండు చోట్ల ఈ బృందాలు పర్యటించనున్నాయి.

- స్వచ్ఛ ఆటోలు ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించాలి.
- రోడ్ల పక్కన చెత్తా చెదారం వేయకుండా దృష్టి సారించాలి.
- ఎక్కడెక్కడ చెత్తా చెదారం వేస్తున్నారో వాటి వివరాలు సేకరించి పూర్తిగా నిర్మూలించాలి.
- వార్డు లెవల్స్‌లో ఒక హ్యాండ్‌బుక్‌ను నిర్వహించాలి. దీనిలో ఆ వార్డుకు సంబంధించిన పూర్తి వివరాలు ఉండాలి.
- వార్డులో రెసిడెన్షియల్‌, కమర్షియల్‌ ఏరియాలను స్పష్టపర్చాలి.
- పెద్ద ఎత్తున చెత్తా చెదారం, వ్యర్థాలు ఎక్కడ నుంచి సేకరిస్తారో వాటి వివరాలు పొందుపరచాలి.
- టాయిలెట్లు, యూరినల్స్‌ ఎక్కడెక్కడక్క ఉన్నాయో ఇందులో పొందుపర్చాలి.
- పార్కులు, గార్డెన్స్‌, చెరువులు, కుంటలు, పర్యాటక ప్రదేశాలు, విద్యా సంస్థలు, డ్రైనేజీ సిస్టం, సీ అండ్‌ డీ వేస్ట్‌ సెకండరీ కలెక్షన్‌ పాయింట్ల వివరాలను ఈ హ్యాండ్‌బుక్‌లో పేర్కొనాల్సి ఉంటుంది.
- పాన్‌ డబ్బాలు, హోటళ్లు, కమర్షియల్‌ ప్రాంతాల వద్ద తప్పనిసరిగా చెత్త డబ్బాలు ఏర్పాటు చేసుకునే విధంగా వ్యాపారస్తులకు అవగాహన కలిగించి వాటిపై నిఘా పెట్టాలి.
- ప్రతి వార్డులో ఒక రిజిస్టర్‌ ఏర్పాటు చేసుకుని ఆ వార్డు స్థాయిలో జరుగుతున్న జీహెచ్‌ఎంసీ కార్యకలాపాలన్నీ నమోదు చేయాలని ఈ రెండు సర్కిళ్ల అసిస్టెంట్‌ మెడికల్‌ ఆఫీసర్స్‌ ఆఫ్‌ హెల్త్‌ (ఏఎంఓహెచ్‌), డిప్యూటీ ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌(డీఈఈ)లను ఆదేశించారు.
- వీరు మూడు నెలలుగా స్వచ్ఛ ఆటోలు యూజర్‌ చార్జీలను ఎంత వరకు వసూలు చేశాయో ఈ రిజిస్టర్‌లో నమోదు చేయాలి.
- పబ్లిక్‌ టాయిలెట్లను ఎప్పటికప్పుడు క్లీన్‌ చేస్తున్నారో లేదో తెలపాలి. వాటి నిర్వహణ సంతృప్తికరంగా ఉందో లేదో చెక్‌ చేసుకోవాలి.
- షెడ్యూల్‌ ప్రకారం టాయిలెట్లు క్లీన్‌ చేస్తున్నారో లేదో చూసుకోవాలి.
- యూజర్‌ చార్జెస్‌ లాగ్‌ బుక్‌, ఫీడ్‌బ్యాక్‌ రిజిస్టర్లను మెయింటెన్‌ చేయాలి.
- పారిశుధ్యంపైనే ఎక్కువ దృష్టి పెట్టాలి.
- సిటిజన్స్‌ ఫీడ్‌బ్యాక్‌పై దృష్టి సారించి తప్పనిసరిగా వారి అభిప్రాయాలకు స్పందించడమే కాకుండా తగిన రీతిలో జవాబు చెప్పాలని అధికారులు ఆదేశిస్తున్నారు.
- వీవీఐపీలు, ముఖ్యమంత్రి నివాసం, రాజ్‌భవన్‌, మంత్రుల నివాసాలు ఉన్న ఈ రెండు సర్కిళ్ల పరిధిలో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అధికారులు మెరుగైన ర్యాంక్‌ కోసం తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నారు.
- వీటిని అమలు చేసే బాధ్యతలను ఏఎంఓహెచ్‌లు, డీఈఈలపై ఉంటుందని ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయి.
- ప్రతిరోజూ ఏఎంఓహెచ్‌లు, డీఈఈలు, ఎస్‌ఎఫ్‌ఏలతో పాటు డీసీలు క్షేత్రస్థాయిలో పర్యటించి సమావేశాలు నిర్వహించి స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

ఘనంగా పీఎంహెచ్‌ఎస్‌ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గుంటూరులోని పట్టాభిపురం మున్సిపల్‌ హైస్కూల్‌ పూర్వ విద్యార్థులు

లక్డీకాపూల్‌: చిన్ననాటి జ్ఞాపకాలు, చేసిన అల్లరి పనులు గుర్తుకు తెచ్చుకొని సందడి చేశారు. గుంటూరు పట్టాభిపురంలోని పట్టాభిపురం మున్సిపల్‌ హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థులు చాలామంది 50 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. నారాయణగూడలోని తాజ్‌మహల్‌ హోటల్‌లో జరిగిన వేడుకలో పూర్వ విద్యార్థులు కలుసుకుని స్కూల్‌ మాస్టర్లు రాఘవేంద్రరావు, స్వరాజ్యలక్ష్మిని ఘనంగా సత్కరించారు.
వేడుకను పూర్వ విద్యార్థి రఘుకుమార్‌ ఆధ్వర్యంలో పతంజలి, నరహరిరావు, సంధ్యశ్రీ, వరలక్ష్మి, అపర్ణ నిర్వహించారు.

ప్రశాంతతతో తీసుకునే నిర్ణయాలు బాగుంటాయి

- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ హైకోర్టు రిటైర్డ్‌ న్యాయమూర్తి జస్టిస్‌ ఈశ్వరయ్య



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న జస్టిస్‌ ఈశ్వరయ్య తదితరులు

పంజగుట్ట: మనలో ఎప్పుడు ప్రశాంతత ఉంటుందో.. అప్పుడే మనం తీసుకునే నిర్ణయాలు బాగుంటాయని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ హైకోర్టు రిటైర్డ్‌ న్యాయమూర్తి జస్టిస్‌ వి.ఈశ్వరయ్య అన్నారు. బ్రహ్మకుమారీస్‌ సంస్థలోని జ్యూరిస్ట్‌ విభాగం, వివిధ న్యాయనిపుణుల సంఘాల ఆధ్వర్యంలో 15వ తేదీన గచ్చిబౌలిలోని శాంతి సరోవర్‌ గ్లోబల్‌ పీస్‌ ఆడిటోరియంలో 'మనస్సు ఉపయోగించడం, చట్టపరమైన, వ్యక్తిగత విజయాన్ని పెంచడం' అనే అంశంపై ఒక్కరోజు జాతీయ న్యాయవాదుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని బ్రహ్మకుమారీస్‌ ప్రశాంతి, రజని, అంజలి, కవిత, డాక్టర్‌ విజయ భాస్కర్‌తో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్‌ ఈశ్వరయ్య మాట్లాడుతూ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మ, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ ఎస్‌.వెంకటనారాయణ భట్టి, బ్రహ్మకుమారీస్‌ హెడ్‌ జయంతి దీదీ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి విజయ్‌సేన్‌ రెడ్డి, త్రిపుర హైకోర్టు న్యాయమూర్తి అమర్‌నాథ్‌గౌడ్‌తో పాటు న్యాయమూర్తులు హాజరవుతారని తెలిపారు.

అల్మారాలో దాచిన నగలు చోరీ

రహమత్‌నగర్‌: అల్మారాలో దాచిన నగలు చోరీకి గురైన ఘటన బోరబండ పోలీస్‌ స్టేషన్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ఎర్రగడ్డ సొమ్య ఆస్పత్రి వద్ద నివాసం ఉండే రాథోడ్‌ రేణుక ఈ నెల 4వ తేదీన 10 గ్రాముల బంగారు ఆభరణాలను బాక్స్‌లో పెట్టి అల్మారాలో దాచింది. ఈ నెల 9వ తేదీన అల్మారా తెలిచి చూడగా ఆభరణాల బాక్స్‌ కనిపించలేదు. ఎంత వెతికినా కనిపించకపోవడంతో ఇంటి పక్కనే ఉన్న ఆస్పత్రిలో పనిచేసే ఓ మహిళపై అనుమానం ఉందని బోరబండ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

త్వరగా సీసీ రోడ్లు వేయండి



బంజారాహిల్స్‌: సోమాజిగూడ డివిజన్‌ పరిధిలోని బీఎస్‌మక్తాలో పాడైపోయిన రోడ్ల స్థానంలో నూతనంగా సీసీ రోడ్లు వేస్తున్న అధికారులు ఒకేసారి రెండు, మూడు రోడ్లు తవ్వేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్తీలోనే పురాతన మసీదు సుబాని మసీదుకు దారి తీసే రెండు దారులు పూర్తిగా తవ్వేయడంతో నమాజ్‌కు వెళ్లి రావడానికి ఆటంకాలు వస్తున్నాయని స్థానిక నేత సయ్యద్‌ మోహిసిన్‌ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్కూల్‌ పిల్లలు, పెద్ద వారు కూడా ఇబ్బంది పడుతున్నారని త్వరితగతిన ఇక్కడ రోడ్డును అందుబాటులోకి తేవాలని వారు కోరుతున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

వెంగళరావునగర్‌: బస్సులో ప్రయాణిస్తున్న మహిళ గొలుసు చోరీకి గురైన ఘటన మధురానగర్‌ పీఎస్‌ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఏ.సత్యవతి మధురానగర్‌కాలనీలో నివాసం ఉంటూ కూకట్‌పల్లిలో ప్రైవేట్‌ జాబ్‌ చేస్తోంది. మంగళవారం ఉదయం మైత్రీవనం వద్ద బస్సు ఎక్కింది. హర్ష మెస్‌ వద్దకు వెళ్లే సమయానికి ఆమె గొలుసు కనిపించలేదు. తన పక్కనే ఓ యువతి కూర్చొని ఉందని, ఆమె దొంగిలించి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తూ మధురానగర్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. గొలుసు, లాకెట్‌ విలువ దాదాపు రూ.1.10 లక్షల వరకు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు



మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఫిలింనగర్‌: జూబ్లీహిల్స్‌ రోడ్డు నంబర్‌–10లో యూరో బ్యాంక్‌ ఎదుట మ్యాన్‌హోల్‌ను ఆనుకుని భారీ గుంత ఏర్పడగా, పొంచి ఉన్న ప్రమాదంపై 'సాక్షి'లో కథనం వెలువడింది. 'జర చూడండి సారూ..' అనే శీర్షికన ప్రచురితమైన సమస్య పట్ల అధికారులు స్పందించారు. మ్యాన్‌హోల్‌ను ఆనుకుని ఏర్పడిన గుంతకు మరమ్మతులు చేపట్టారు. రోజురోజుకూ ఈ గుంత పెరుగుతుండటమే కాకుండా మ్యాన్‌హోల్‌ నుంచి మురుగు అంతా రోడ్లపై పారుతోంది. వాహనదారులు, పాదచారులు ప్రమాదకరంగా ఇక్కడి నుంచి రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండు మూడు రోజుల్లో మరమ్మతులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

ట్రిపుల్‌ ఆర్‌ అలైన్‌మెంట్‌ మార్చాలి

- 25 కిలోమీటర్ల నుంచి 40 కిలోమీటర్లకు పెంచాలి
- ఎన్‌హెచ్‌ఏఐ ఎదుట ట్రిపుల్‌ ఆర్‌ భూనిర్వాసితుల ధర్నా



ధర్నాలో ట్రిపుల్‌ ఆర్‌ భూనిర్వాసితులు

బంజారాహిల్స్‌: రీజనల్‌ రింగ్‌ రోడ్డు(ట్రిపుల్‌ ఆర్‌) నార్త్‌ సైడ్‌ అలైన్‌మెంట్‌ మార్చాలంటూ ట్రిపుల్‌ ఆర్‌ భూ నిర్వాసితుల ఐక్య వేదిక(ఉత్తర భాగం) ఆధ్వర్యంలో నేషనల్‌ హైవేస్‌ అథారిటీ ఆఫ్‌ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్య వేదిక ప్రతినిధులు మాట్లాడుతూ ట్రిపుల్‌ ఆర్‌ అలైన్‌మెంట్‌ను చౌటుప్పల్‌, భువనగిరి, గజ్వేల్‌, తూప్రాన్‌, సంగారెడ్డిల వద్ద ఓఆర్‌ఆర్‌ నుంచి 25–28 కిలోమీటర్లు తీసుకోవడం వల్ల మున్సిపల్‌ ప్రాంతాలు, హెచ్‌ఎండీఏ లే అవుట్లు రెండు మూడు భాగాలుగా విడిపోతున్నాయని వారు అన్నారు. ఈ ప్రాంతంలో ఎకరాకు రూ.2–5 కోట్ల విలువ గల భూములు, గజానికి రూ.20 వేలు కలిగిన ప్లాట్లు, ఇళ్లు ట్రిపుల్‌ ఆర్‌లో పోతున్నాయని చెప్పారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని అలైన్‌మెంట్‌ 40 కిలోమీటర్లకు అనగా గ్రామీణ ప్రాంతాలకు మార్చాలన్నారు. ట్రిపుల్‌ ఆర్‌ అలైన్‌మెంట్‌ను 40 కిలోమీటర్లకు తీసుకోవడం వల్ల గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందడంతో పాటు ప్రభుత్వానికి పరిహార బాధితుల సంఖ్య కూడా తగ్గుతుందన్నారు. ఈ ప్రాంత రైతులు గతంలో వివిధ రకాల ప్రభుత్వ ప్రాజెక్టులు, నేషనల్‌ హైవేలు, విద్యుత్‌ లైన్లు, నీటి కాల్వల కోసం రెండు మూడుసార్లు తమ భూములను కోల్పోయారన్నారు. మళ్లీ ఇప్పుడు ట్రిపుల్‌ ఆర్‌లో కోల్పోతున్నారన్నారు.

స్పోర్ట్స్‌ ఎక్సలెన్స్‌ అవార్డ్స్‌ వాల్‌ పోస్టర్‌ ఆవిష్కరణ



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌ గౌడ్‌

శ్రీనగర్‌కాలనీ: సమాజ శ్రేయస్సుతో పాటు సేవా రంగాల్లో విశేష సేవలు అందించే వారిని గుర్తించి వైభవంగా సత్కరించడం ప్రశంసనీయమని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌ గౌడ్‌ అన్నారు. విద్య, వైద్య, క్రీడా, వ్యాపార, మహిళా శక్తి రంగాల్లో విశేష సేవలు అందించిన వారికి జేఎంజీ గ్రూప్స్‌ ఆధ్వర్యంలో రైజింగ్‌ తెలంగాణ సీఎస్‌ఆర్‌ అవార్డ్స్‌లో భాగంగా స్పోర్ట్స్‌ ఎక్సలెన్స్‌ అవార్డ్స్‌కు సంబంధించిన వాల్‌ పోస్టర్‌ను మంగళవారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. క్రీడాకారులకు ప్రోత్సహిస్తూ మరింత మంది ఇన్‌స్పైర్‌ అయ్యేలా క్రీడాకారులను సత్కరించాలని అనుకున్నామని జేఎంజీ గ్రూప్స్‌ సీఈఓ జగన్నాథం మాదిరెడ్డి తెలిపారు. వచ్చేనెల 20వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఎంజీ గ్రూప్స్‌ డైరెక్టర్‌ పవన్‌, సెవెన్‌హిల్స్‌ స్పోర్ట్స్‌ ఫౌండేషన్‌ వ్యవస్థాపకులు బి.వెంకటేష్‌, తెలంగాణ ఒలింపిక్‌ సంఘం మాజీ కార్యదర్శి కె.మహేశ్వర్‌ పాల్గొన్నారు.

కమ్యూనిటీ మీడియేషన్‌ సెంటర్లతో సత్వర పరిష్కారం



స్టేట్‌ లీగల్‌ సర్వీసెస్‌ అథారిటీ మెంబర్‌ సెక్రటరీ, జిల్లా సెషన్స్‌ జడ్జి సీహెచ్‌ పంచాక్షరి

ఫిలింనగర్‌: మీడియేషన్‌ సెంటర్ల ద్వారా సత్వర పరిష్కారం, న్యాయంతో పాటు కోర్టులపై కూడా భారం తగ్గుతుందని తెలంగాణ స్టేట్‌ లీగల్‌ సర్వీసెస్‌ అథారిటీ మెంబర్‌ సెక్రటరీ, జిల్లా సెషన్స్‌ జడ్జి సీహెచ్‌. పంచాక్షరి అన్నారు. ఫిలింనగర్‌లోని మాగంటి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో మీడియేషన్‌ సెంటర్లపై శిక్షణ పొందిన ప్రతినిధులతో కలిసి మంగళవారం బస్తీవాసులకు ఈ సెంటర్‌ ఆవశ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023 మీడియేషన్‌ చట్టం ప్రకారం ఈ కేంద్రాలు ఏర్పాటు చేశారని నిజామాబాద్‌, కామారెడ్డి జిల్లాల్లో ఏర్పాటు చేసిన సెంటర్లలో మంచి ఫలితాలు రావడంతో ఇప్పుడు అన్ని చోట్లా ఏర్పాటు చేసేందుకు న్యాయ వ్యవస్థ ఏర్పాట్లు చేస్తోందని తెలిపారు. ఈ మీడియేషన్‌ సెంటర్‌లో శిక్షణ పొందిన మధ్యవర్తుల ద్వారా చిన్న చిన్న కుటుంబ తగాదాలతో పాటు గొడవలు వంటి వాటికి సత్వర పరిష్కారం పొందవచ్చన్నారు. ఈ సెంటర్ల వల్ల కోర్టులు, పోలీస్‌ స్టేషన్లపై భారం తగ్గుతుందని అన్నారు. తక్కువ సమయంలోనే మెరుగైన ఫలితాలను వీటి వల్ల పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో సీనియర్‌ సివిల్‌ జడ్జి, స్టేట్‌ లీగల్‌ అథారిటీ సర్వీసెస్‌ అడ్మినిస్ట్రేటివ్‌ ఆఫీసర్‌ జి.కళార్చన, ఫిలింనగర్‌ ఎస్‌ఐ గణేష్‌, మీడియేషన్‌ కమిటీ సభ్యులు బొజ్జ పీటర్‌, సుగుణమ్మ, ఎస్‌.దాసు తదితరులు పాల్గొన్నారు.

షాపు ఖాళీ చేయాలంటూ బెదిరించిన వ్యక్తులపై కేసు

బంజారాహిల్స్‌: లీజుకు తీసుకున్న భవనంలోకి బలవంతంగా వచ్చి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ మిఠాయిల దుకాణం వ్యాపారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్‌ పోలీసులు నిందితులపై కేసు నమోదు చేశారు. వివరాలు.. బంజారాహిల్స్‌ రోడ్డు నంబర్‌–2లోని షేక్‌పేట మండల కార్యాలయం పక్కన ఉన్న భవనంలో మేడిశెట్టి సూర్యవిజయ్‌ అనే వ్యాపారి గత ఏడాది నవంబర్‌లో లీజుకు తీసుకున్నాడు. శ్రేష్ఠ అగర్వాల్‌ అనే వ్యక్తికి చెందిన ఈ భవనాన్ని సూర్యవిజయ్‌ లీజు తీసుకుని ఇందులో ఉత్సవ్‌ ది స్వీట్స్‌ కేఫ్‌ అనే మిఠాయిల దుకాణం ఏర్పాటు చేశాడు. ఇంటీరియర్‌ కోసం రూ.75 లక్షలు ఖర్చు చేశాడు. రూ.10 లక్షలు యజమానికి అడ్వాన్స్‌గా ఇచ్చాడు. ఈ దుకాణం లాభాల్లో నడుస్తుండటాన్ని చూసి ఓర్వలేక శ్రేష్ఠ అగర్వాల్‌ తన బంధువులు పీయూష్‌ అగర్వాల్‌, అతుల్‌తో కలిసి షాపులోకి బలవంతంగా ప్రవేశించి బిల్డింగ్‌ను సీజ్‌ చేశాడు. సామాగ్రిని ధ్వంసం చేశాడు. ఖాళీ చేసి వెళ్లిపోవాలంటూ బెదిరించాడు. అన్యాయంగా ముందస్తు పథకంతో చీటింగ్‌ చేసి నమ్మక ద్రోహానికి పాల్పడిన వీరిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఫిర్యాదు చేశాడు. శ్రేష్ఠ అగర్వాల్‌, పీయూస్‌ అగర్వాల్‌, అతుల్‌పై బంజారాహిల్స్‌ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్‌ మోసగాడి వలలో వృద్ధుడు

బంజారాహిల్స్‌: విమానం టికెట్‌ క్యాన్సిల్‌ చేసేందుకు కస్టమర్‌ కేర్‌లో ఓ నంబర్‌ తీసుకుని మాట్లాడుతున్న సమయంలో వృద్ధుడిని సైబర్‌ మోసంలోకి దింపి డబ్బులు డ్రా చేసిన ఘటన బంజారాహిల్స్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్‌ రోడ్డు నంబర్‌–4లో నివసించే ఎం.రాఘవరావు అనే వ్యాపారి తన విమానం టికెట్‌ను క్యాన్సిల్‌ చేసుకునేందుకు కస్టమర్‌ కేర్‌ ద్వారా ఓ నంబర్‌ను తీసుకున్నాడు. ఫ్లైట్‌ టికెట్‌ రూ.5 వేలు రిఫండ్‌ రావాల్సి ఉండగా ఆయన సదరు నంబర్‌కు ఫోన్‌ చేశాడు. బాధితుడు రాఘవరావు తనకు రావాల్సిన డబ్బు గురించి పూర్తి వివరాలను అవతలి వ్యక్తికి స్క్రీన్‌ షాట్‌ ద్వారా పంపించాడు. వెంటనే రాఘవరావుకు తెలియకుండా ఆయన ఫోన్‌పే యాప్‌ ఓపెన్‌ అయ్యింది. అంతటితో ఊరుకోకుండా తన పాస్‌వర్డ్‌ చెప్పాల్సిందిగా అవతలి వైపు అడగడంతో డబ్బు వస్తుందేమోనని నంబర్‌ తెలిపాడు. క్షణాల్లోనే రూ.66,516 ఒకసారి, రూ.27,499 రెండోసారి వరుసగా సైబర్‌ మోసగాడు డ్రా చేశాడు. వెంటనే బాధితుడు బంజారాహిల్స్‌ పోలీస్‌స్టేషన్‌లో తనకు జరిగిన సైబర్‌ మోసంపై ఫిర్యాదు చేశాడు. బంజారాహిల్స్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని రంగాల్లో విజయం సాధిస్తున్న మహిళలు



కార్యక్రమంలో పుష్పాచక్రపాణి తదితరులు

బంజారాహిల్స్‌: డాక్టర్‌ బీఆర్‌ అంబేద్కర్‌ సార్వత్రిక విశ్వవిద్యాలయ మహిళాభివృద్ధి, విస్తరణ కేంద్రం ఆధ్వర్యంలో 'స్వయం–సాధికారత' అనే అంశంపై మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విశ్వవిద్యాలయ అకాడమిక్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ జి.పుష్పా చక్రపాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, యూజీసీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహించిన ఫిట్‌ ఇండియా కార్యక్రమంలో భాగంగా దేశంలో 69 విశ్వవిద్యాలయాలను ఎంపిక చేశారని, అందులో తెలంగాణ రాష్ట్రం నుంచి కేవలం డ్వార్‌ బీఆర్‌ అంబేద్కర్‌ సార్వత్రిక విశ్వవిద్యాలయం మాత్రమే ఉండటం గర్వకారణంగా ఉందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో గొప్ప విజయాలు సాధిస్తున్నప్పటికీ సమాజంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలికల ఉత్సాహాన్ని గమనించి కుటుంబ సభ్యులు, వారిని క్రీడల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని, దీంతో వారు ఆరోగ్యంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పొందుతారని వివరించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజులుగా విశ్వవిద్యాలయంలో మహిళల క్రీడా వారోత్సవ కార్యక్రమాలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్‌ డాక్టర్‌ ఎల్‌.విజయకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో స్త్రీని మించిన మహా శక్తి ఏదీ లేదని, ఆమె లేకపోతే సృష్టి లేదన్నారు. సామాజిక కార్యకర్త సుధా గోపరాజు, భూమిక ఉమెన్స్‌ కలెక్టివ్‌ ప్రతినిధి ప్రశాంతి, ట్రాన్స్‌జెండర్‌ రచన ముద్రబోయిన, స్వతంత్ర కార్యకర్త గీతా గోటి, అభిహార సోషల్‌ ఎంటర్‌ప్రైజెస్‌ సీఈఓ సుధా ముళ్లపూడి, విశ్వవిద్యాలయ మహిళాభివృద్ధి, విస్తరణ కేంద్రం ఇన్‌చార్జి మేరీ సునంద, ప్రొఫెసర్‌ రాణి రజిత మాధురి, శ్రీదేవి, డాక్టర్‌ రజని, ఉదయని తదితరులు పాల్గొన్నారు.